విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి

విద్యార్థులతో డాక్టర్ సుధాకర్

రేగొండ, జూలై 12 : విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉండి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని డాక్టర్ అప్పాల సుధాకర్ అన్నారు. హనుమకొండ వాసవి దవాఖాన నిర్వాహకుడు డాక్టర్ సుధాకర్ భార్య ఇందిర జన్మదినం సందర్భంగా స్వగ్రామమైన రేగొండ మండలం దమ్మన పేట ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు రూ.35వేల విలువైన స్కూల్ బ్యాగులు, నోట్ పుస్తకాలు, అంగన్‌వాడీ కేంద్రంలోని పిల్లకు ఆయన మనుమరాలు సాయి సహస్ర చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం విద్యార్థులకు అవసరమైన సామగ్రి ఇస్తున్నానని, రానున్న రోజుల్లో పాఠశా అభివృద్ధికి ముందు వరుసలో ఉంటానన్నారు. కార్యక్రమంలో డాక్టర్ కుటుంబ సభ్యులు రంజిత్, సూర రాఘవులు, మాజీ సర్పంచ్ నడిపెల్లి శ్రీనివాసరావు, మాజీ ఎంపీటీసీ ఐలి శ్రీధర్‌గౌడ్, హెచ్ఎం విజయపాల్‌రెడ్డి, గ్రామస్తులు రాజనర్సయ్య, ఉపాధ్యాయులు సుధ, సుభద్ర, అన్న పూర్ణ, శ్రీనివాస్, కిరణ్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

రేగొండ, జూలై 12 : సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉంటూ, గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలని డీఎంహెచ్‌వో మధుసూదన్ వైద్య సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం మండలంలోని రాయపల్లె గ్రామంలో నిర్వహించిన డ్రై డేలో భాగంగా మంచినీటి సరఫరా గేట్ వాల్వ్ కుండీలను డీఎంహెచ్‌వో పరిశీలించారు. అనంతరం రంగయ్యపల్లెలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు సూచించారు. వైద్య సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే

మాట్లాడుతున్న వైద్యాధికారి మధుసూదన్

చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట వైద్యా ధికారి హిమాబిందు, ఏఎన్ఎం, సిబ్బంది ఉన్నారు.

విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై చక్రపాణి

కాళేశ్వరం, జూలై 12 : విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని ఎస్సై చక్రపాణి అన్నారు. శుక్రవారం కాళేశ్వరంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. అలాగే సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కల్పించారు. పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రంగయ్యపల్లిలో నిర్వహిస్తున్న ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో మధుసూదన్

రేగొండ మండలం రంగయ్యపల్లిలో మురికినీటి నిల్వను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో

సీజనల్ అలర్ట్..

- పొంచి ఉన్న వ్యాధుల ముప్పు
- అప్రమత్తమైన వైద్యారోగ్య శాఖ
- 14 ర్యాపిడ్ రెస్పాన్స్ టీంలు
- కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం
- ఆరు నెలల్లో ఒక డెంగీ కేసు
- పర్యవేక్షిస్తున్న కలెక్టర్ రాహుల్ శర్మ

జయశంకర్ భూపాలపల్లి, జూలై 12 (నమస్తే తెలంగాణ) : వర్షాకాలం ప్రారంభమవడంతో సీజనల్ వ్యాధులపై వైద్య ఆరోగ్యశాఖ అప్రమత్తమైంది. కలెక్టర్ రాహుల్ శర్మ వైద్యాధికారులతో సమీక్షలు నిర్వహిస్తూ పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. వ్యాధుల కట్టడికి ప్రణాళికలు సిద్ధం చేశారు. జిల్లాలోని నాలుగు మండలాల్లో సుమారు 20 పరకు ఉన్న హైరిస్క్ గ్రామాలపై అధికారులు ఫోకస్ పెట్టారు. గడిచిన ఆరు నెలల్లో ఒక డెంగీ కేసు నమోదు కాగా, చికిత్స అందించారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తమైన వైద్య ఆరోగ్యశాఖ ఇప్పటికే వ్యాధుల కట్టడికి ప్రణాళిక తయారు చేసింది. ప్రతి గ్రామ పంచాయతీలో వారానికి రెండు సార్లు వైద్య శిబిరాలు నిర్వహించేందుకు ప్లాన్ చేసింది. 14 ర్యాపిడ్ రెస్పాన్స్ టీంలను ఏర్పాటు చేసి కలెక్టరేట్‌లో కంట్రోల్ రూంను ఏర్పాటు చేసింది. ఇప్పటికే సీహెచ్‌సీ, పీహెచ్‌సీలకు రోగుల తాకిడి పెరిగింది. జ్వరం, దగ్గు, తలనొప్పి, విరేచనాలు వంటి బాధలతో దవాఖానలకు చేరుకుని చికిత్స పొందుతున్నారు. గ్రామ పంచాయతీ పరిధిలోని వైద్యారోగ్య సిబ్బంది అప్రమత్తమై పారిశుధ్య పనులు చేయిస్తున్నారు. యాంటీ లార్వా ఆపరేషన్ మొదలుపెట్టారు. గ్రామాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించి వైద్య సేవలు అందిస్తున్నారు. ఎక్కువ రోజులు జ్వరంతో బాధపడుతన్న వారి బ్లడ్ శాంపిల్స్ సేకరించి ల్యాబ్‌కు పంపిస్తున్నారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేస్తున్నారు. మల్హర్ మండలం ఎడ్లపల్లిలో డెంగీ కేసు నమోదు కాగా, అతనికి చికిత్సలు అందించి నయం చేశారు.

వారానికి రెండు వైద్య శిబిరాలు

జిల్లాలో సీజనల్ వ్యాధుల దృష్ట్యా వారానికి ప్రతి జీపీలో రెండు సార్లు వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ రాహుల్ శర్మ వైద్య అధికారులను ఆదేశించారు. జిల్లాలో 13 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, రెండు కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ఒక పట్టణ ఆరోగ్య కేంద్రం, 65 పల్లె దవాఖానలు, 90 సబ్ సెంటర్లు, ఒక జిల్లా ఆస్పత్రి ఉన్నాయి. ఆరు నెలల్లో గ్రామాల్లో 137 వైద్య శిబిరాలే ఏర్పాటు చేసి ర్యాపిడ్ కిట్స్‌తో మలేరియా నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నారు.

నాలుగు మండలాల్లో హైరిస్క్ గ్రామాలు

ప్రతి వానకాలంలో వ్యాధులు ఎక్కువగా ప్రబలే గ్రామాలను అధికారులు హైరిస్క్‌గా గుర్తించి ప్రత్యేక చికిత్సలు అందిస్తున్నారు. గతంలో కంటే వాటి సంఖ్య ఇప్పుడు గణనీయంగా తగ్గింది. ప్రస్తుతం కాటారం, మహాముత్తారం, మల్హర్, మహదేవపూర్ మండలాల్లోని సుమారు 20 గ్రామాలను హైరిస్క్ నిర్ధారించారు. అలాగే గణపురం మండలంలోని ఒకటి రెండు గ్రామాలు వ్యాధులు ఎక్కువగా ప్రబలే గ్రామాలుగా గుర్తించారు. వీటిపై ఫోకస్ పెట్టిన అధికారులు ఇప్పటికే రెండుసార్లు డిస్ట్రిక్ట్ కోఆర్డినేషన్ మీటింగ్ ఏర్పాటు చేసి ఎంపీడీవోలు, తహసీల్దార్లను అప్రమత్తం చేశారు. వారానికి రెండు సార్లు డ్రైడే నిర్వహించాలని దేశాలు జారీ చేశారు.

ఫలితాలిస్తున్న పల్లె, పట్టణ ప్రగతి

కేసీఆర్ ప్రభుత్వం చేపట్టిన పల్లె, పట్టణ ప్రగతి కార్యక్రమాలతో గ్రామాలు పరిశుభ్రంగా మారాయి. గత ప్రభుత్వం భారీగా నిధులు కేటాయించి డ్రైనేజీలు శుభ్రం చేయడం, శిథిలమైన ఇండ్లు, నీటి నిల్వలు, పిచ్చి మొక్కలను తొలిగించడం లాంటి పనులు చేపట్టి పల్లెలను అద్దంలా మార్చింది. దీంతో గ్రామాల్లో రోగాల సంఖ్య తగ్గుముఖం పట్టింది. దవాఖానలకు వైరల్ ఫీవర్స్‌తో తప్ప మలేరియా, డెంగీ, డయేరియా వ్యాధులతో రావ డం లేదు. గతంలో 18 డెంగీ కేసులు నమోదు కాగా, ప్ర స్తుతం ఆరు నెలల్లో ఒక డెంగీ కేసు మాత్రమే నమోదైంది.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉన్నాం

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉన్నాం. కలెక్టర్ రాహుల్ శర్మ సైతం ప్రత్యేత దృష్టి సారించారు. ఇప్పటికే రెండుసార్లు సీజనల్ వ్యాధులపై జిల్లా స్థాయి కోఆర్డినేషన్ సమీక్షలు నిర్వహించారు. జిల్లాలో 1 డెంగీ కేసు మాత్రమే నమోదు కాగా చికిత్సతో నార్మల్ స్టేజికి తీసుకువచ్చాం. ఇప్పటికే గ్రామాల్లో 137 వైద్య శిబిరాలు నిర్వహించాం. మళ్లీ జిల్లాలో ప్రతి జీపీకి వారానికి రెండు సార్లు వైద్య శిబిరాలు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రణాళిక తయారు చేశాం. వ్యాధులతో ఏ ఒక్కరికి ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకుంటున్నాం.

- డాక్టర్ మధుసూదన్, డీఎంహెచ్‌వో, భూపాలపల్లి

అధికారులతో ములుగు కలెక్టర్ సమీక్ష

మాట్లాడుతున్న కలెక్టర్ దివాకర

ములుగు రూరల్, జూలై 12 : కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ శ్రీజతో కలిసి కలెక్టర్ టీఎస్ దివాకర మహిళా శక్తి, మినీ పరిశ్రమలు, ఫుడ్ ప్రాసెసింగ్, పైలట్ ప్రాజెక్టులపై సమీక్ష నిర్వహించారు. ఎంపీడీవోలు, ఏపీవోలకు పలు సూచనలు చేశారు. పూర్తి స్థాయిలో ప్రతిపాదనలు సిద్ధం చేసి సంబంధిత అధికారులకు ప్రతిపాదనలు అందజేయాలని ఆదేశించారు. నరేగా, ఆవెన్యూ ప్లాంటేషన్‌పై ఆరా తీశారు. ఫుడ్ ప్రాసెసింగ్‌పై అగ్రికల్చర్ అధికారుల సూచనలు తీసుకొని పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. సమాచారాన్ని డాటా ఎంట్రి ఆపరేటర్ల ద్వారా ఆన్‌లైన్‌లో భద్రపర్చాలన్నారు. సమీక్షలో డీఆర్‌డీవో శ్రీనివాస్‌కుమార్, ఎల్‌డీఎం రాజ్‌కుమార్, ఎంపీడీవోలు, ఏపీవోలు, డీఆర్‌డీఏ డీపీ, బ్యాంకు మేనేజర్లు, సెర్ప్ ఉద్యోగులు పాల్గొన్నారు. అలాగే మెడికల్ అండ్ హెల్త్ సీజన్ మలేరియా, డెంగీ, చికున్ గున్యా వ్యాధుల నివారణపై వైద్యాధికారులతో కలెక్టర్ దివాకర సమీక్ష నిర్వహించారు. వైద్యాధికారుల ముందస్తు ప్రణాళికలను అడిగి తెలుసుకున్నారు. వ్యాధులు సోకిన వారి వివరాలతో పాటు డ్రగ్స్ నిల్వపై ఆరా తీశారు. ఇంటింటా సర్వే నిర్వహించి నీళ్ల నిల్వ లేకుండా ఉండేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వ రెసిడెన్షియల్ హాస్టల్స్‌లో విద్యార్థులకు వైద్య పరీక్షలు చేయాలని ఆదేశించారు. సమావేశంలో డీఎంహెచ్‌వో అల్లెం అప్పయ్య, డిప్యూటీ డీఎంహెచ్‌వో రవీందర్, మండలాల మెడికల్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

ఒప్పంద ఉద్యోగానికి దరఖాస్తుల ఆహ్వానం

ములుగురూరల్, జూలై 12 : జిల్లాలోని డిస్టిక్ హబ్ ఫర్ ఎంపవర్మెంట్ ఆఫ్ ఉమెన్ నందు కాంట్రాక్టు బేసిక్‌లో పనిచేసేందుకు మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు డీడబ్ల్యూవో స్వర్ణలతా లెనినా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు.. ఒప్పంద నియామకాన్ని చేపట్టనున్నామని, అభ్యర్థులు గ్రాడ్యుయేట్ పూర్తి చేసి, ఉండాలన్నారు. సంబంధిత ధ్రువ పత్రాలను ఈ నెల 15 నుంచి 24న సాయంత్రం 5 గంటల లోపు గెజిటెడ్ ఆఫీసర్ ధ్రువీకరణ చేయించి అందించాలన్నారు. పూర్తి వివరాలకు 9866166105ని సంప్రదించాలని సూచించారు.

నాయకత్వ లక్షణాలపై పిల్లలకు అవగాహన

వెంకటాపురం (నూగూరు) జూలై 12 : మండల పరిధిలోని ఆలుబాక జిల్లా పరిషత్ పాఠశాలలో శుక్రవారం కాఫేడ్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో పిల్లలకు వ్యక్తిత్వం, నాయకత్వ లక్షణాలపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకట్రావు బాలల హక్కులు, పిల్లల పార్లమెంట్ ఉపయోగాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో కాఫెడు స్వచ్ఛంద సంస్థ సభ్యులు గొందిహనుమంత్, తదితరులు ఉన్నారు.

నేటి నుంచి ఉపాధి గ్రామ సభలు

గణపురం, జూలై 12 : జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా మండలంలోని 17 పంచాయతీ పరిధిలో ఉపాధిహామీ సామాజిక తనిఖీ నివేదిక గ్రామసభలు నేటి నుంచి సోమవారం వరకు నిర్వహించి, 16న మండల ఓపెన్ ఫోరం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో భాస్కర్ తెలిపారు. శనివారం మండలంలోని లక్ష్మీరెడ్డిపల్లి, కొండాపూర్, గొల్లపల్లి, వెంకటేశ్వర్లపల్లి, బుర్రకాయలగూడెం, సీతారాంపూర్, అప్పయ్యపల్లి, ఆదివారం బస్వరాజుపల్లి, గణపురం, పరశురాంపల్లి, గాంధీనగర్, నగరంపల్లి, ధర్మారావుపేట, కర్కపల్లి, సోమవారం చెల్పూర్, బుద్ధారం, మైలారంలోని జీపీ కార్యాలయాల ఆవరణలో గ్రామసభలు ఉంటాయన్నారు. ప్రజలు హాజరుకావాలని తెలిపారు.

గుడిసెలు తొలగించాలి

వాజేడు, జూలై 12 : మండలంలోని మండపాక సమీప మిషన్ భగీరథ గ్రిడ్ సమీపంలో వేసిన గుడిసెలు తొలగించాలని తహసీల్దార్ శ్రీరాముల శ్రీనివాస్, ఆర్ఐ కుమారస్వామి గుడిసె వాసులకు సూచించారు. శుక్రవారం వారు రెవెన్యూ, పోలీస్ సిబ్బందితో అక్కడికి చేరుకొని గుడిసెలు వేసిన స్థలం సర్వే నంబర్ 11 పూసూరు(జి)లో ఉండడంతో పాటు పల్లె ప్రకృతి వనం కోసం కేటాయించిందని గుడిసె వాసులకు తెలిపారు. తక్షణమే వేసిన గుడిసెలు తీసేయాలని ఆదేశించారు. గోదావరి వరదలు వచ్చిన ప్పుడు తాము ముంపునకు గురవుతున్నామని, నివాస స్థలాలు లేనందున ఇక్కడే నివాసముం టున్నామని అధికారులకు తెలిపారు. అక్కడ సంవత్సరం నుంచి గుడిసెలు వేసుకొని ఉంటున్న వారు సైతం అక్కడికి చేరుకొని సీపీఎం నాయకుల అధికారులతో వాగ్వాదానికి దిగారు. దీంతో తహసీల్దార్ ఉన్నతాధికారులు, మంత్రి దృష్టికి తీసుకెళ్లి అనుమతి తెచ్చుకోవాలని లేకుంటే గుడిసెలు తొలగించాలని వారికి సూచించారు.

మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలి

ములుగురూరల్, జూలై 12 : మూడు రోజుల పాటు భారీ వర్షాలు ఉన్న నేపథ్యంలో వాతావరణ శాఖ జిల్లాను ఆరెంజ్ అలర్ట్‌గా ప్రకటించిందని, మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా మత్స్య శాఖ అవినాశ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. లక్నవరం, రామప్ప, గుండ్లవాగు, మల్లూరు నర్సింహసాగర్, గోదావరి నది పరీవాహక ప్రాంతంలో ఉన్న వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు మత్స్యకార సొసైటీ సభ్యులు అలర్ట్‌గా ఉండాలన్నారు.

వంద శాతం పంట నమోదు ప్రక్రియ చేపట్టాలి

- రైతులకు సరిపడా ఎరువులుఅందుబాటులో ఉంచాలి
- వ్యవసాయ అధికారులతో భూపాలపల్లి కలెక్టర్ సమీక్ష

భూపాలపల్లి రూరల్, జూలై 12 : జిల్లాలో వంద శాతం పంట నమోదు చేయాలని కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో వ్యవసాయ శాఖ అధికారులతో రైతు భరోసా, పంట బీమా, పంట నమోదు, విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, తనిఖీ లు, మట్టి నమూనాల సేకరణ, పంట దిగుబడి, వర్షాభావం నేపథ్యంలో ప్రత్యామ్నాయ పంటలు సాగు, తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వంద శాతం పంట నమోదు ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. రైతు భరోసా, రైతు బీమా, పీఎం కిసాన్ లాంటి పథకాలను క్షేత్ర స్థాయిలో రైతులకు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వానకాలంలో పంటలను కాపాడుకోవడానికి తీసుకోవాల్సిన చర్యలపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఎరువుల కొరత లేకుండా చూడాలని, పంటలకు సరిపడా యూరియా, డీఏపీ, ఇతర ఎరువులను అందుబాటులో ఉంచాలన్నారు. ఎరువుల కృత్రిమ కొరత, అధిక ధరలకు విక్రయించినా, నకిలీ విత్తనాలు అమ్మేవారిపై చర్యలు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అధిక దిగుబడి వచ్చే లాభసాటి పంటలు, మార్కెట్ లో డిమాండ్ ఉన్న పంటలపై రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. ప్రతి 15 రోజులకొకసారి పురుగు మందుల దుకాణాలను తనిఖీ చేయాలని, జిల్లాలో వర్షపాతం తక్కువ నమోదైన నేపథ్యంలో ఆరుతడి పంటల సాగుపై రైతులు మొగ్గుచూపేలా చర్యలు తీసుకోవాలన్నారు. అన్నిరకాల విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, ఎక్కడైనా విత్తనాలు కొరత ఉంటే ఆయా మండల వ్యవసాయ అధికారులు, జిల్లా వ్యవసాయ అధికారిని సంప్రదించాలని సూచించారు. వానకాలంలో పంటలకు సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు, పశుగ్రాసం, పశువుల దాణా, పశువులకు సోకే వ్యాధులు, వాటి నివారణ చర్యలపై అధికారులు, రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో డీఏవో అనురాధ, ఏడీఏ రాజ్‌కుమార్, ఏవోలు, ఏఈవోలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్ శర్మ

ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలి

జిల్లాలో ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఇసుక పాలసీకి విధి విధానాల రూపకల్పనపై పోలీస్, రెవెన్యూ, మైనింగ్, రవాణా, టీజీఎండీసీ, జాతీయ రహదారులు, భూ గర్భ జలవనరుల శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎలాంటి అనుమతులు లేకుండా రాత్రి వేళల్లో జిల్లా వ్యాప్తంగా ఉన్న వాగులు, గోదావరి పరివాహక ప్రాంతాల్లోని ఇసుక రీచ్‌ల నుంచి ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారని ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. అతివేగం, ఓవర్ లోడ్, సరైన వే బిల్లులు లేకుండా లారీలు నడిపితే కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. టీజీ ఎండీసీ అధికారుల పర్యవేక్షణ కొరవడిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ పథకాలు, ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణాలకు ఉచిత ఇసుక సరఫరా, అనుమతులు ఉన్న కట్టడాలకు జీవో నంబర్ 03 ప్రకారం పంచాయతీ కార్యదర్శులు అనుమతులు ఇస్తారన్నారు. అక్రమంగా ఇసుక నిల్వ చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తహసీల్దార్లుచ పోలీస్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో ఎస్పీ కిరణ్ ఖరే, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఆర్డీవో మంగీలాల్, మైనింగ్ అధికారి జయరాజ్, జాతీయ రహదారుల ఈఈ మనోహర్, భూగర్భ జల శాఖ అధికారి శ్రీనివాస్, తహసీల్దారులు, సీఐలు పాల్గొన్నారు.

దివ్యాంగులకు వరం సదరం క్యాంపులు

డీఆర్డీవో నరేశ్‌కుమార్

కృష్ణకాలనీ, జూలై 12 : దివ్యాంగులకు సదరం క్యాంపులు వరమని జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి నరేశ్‌కుమార్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రధాన దవాఖానలో సదరం క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్‌డీవో మాట్లాడుతూ దివ్యాంగులకు ప్రభుత్వం నుంచి వచ్చే అన్ని పథకాలు అందించాలనే లక్ష్యంతో సదరం క్యాంపు ఏర్పాటు చేసిట్లు చెప్పారు. 120 స్లాట్స్ కేటాయించగా 81 మంది మీసేవల్లో బుక్ చేసుకోగా 75 మంది హాజరయ్యారన్నారు. వారికి ప్రత్యేక వైద్య నిపుణులతో వైద్య పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో కార్యాలయం సిబ్బంది, జిల్లాలోని దివ్యాంగులు పాల్గొన్నారు.

సదరం క్యాంపునకు హాజరైన దివ్యాంగుల వివరాలు స్వీకరిస్తున్న సిబ్బంది

ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తున్న మోదీ

మాట్లాడుతున్న సీపీఐ పట్టణ కార్యదర్శి ప్రవీణ్

భూపాలపల్లి రూరల్, జూలై 12 : ప్రధాని మోదీ దేశంలోని ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తున్నారని సీపీఐ పట్టణ కార్యదర్శి సోతుకు ప్రవీణ్‌కుమార్ అన్నారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సింగరేణి భూపాలపల్లి జీఎం కార్యాలయం ఎందుట నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు ఆరో రోజుకు చేరగా ఏఐటీయూసీ వైస్ ప్రెసిడెంట్ మాతంగి రామచందర్ దీక్షలను ప్రారంభించారు. దీక్షలకు సీపీఎం జిల్లా కార్యదర్శి బంధు సాయిలు, టీపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి సేవా నాయక్ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ జాతీయ సంపద అయిన బొగ్గు బ్లాక్‌లను కేంద్ర ప్రభుత్వం అదానీ, అంబానీలకు కట్టబెడుతూ పెట్టుబడిదారులకు కొమ్ము కాస్తున్నదని విమర్శించారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి నేరెళ్ల జోసెఫ్, డీహెచ్‌పీఎస్ నాయకులు కాంతారావు, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఆరబోయిన వెంకటేష్, ఎన్ఎఫ్ఐడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు పొన్నగంటి లావణ్య, పీకే రవికాంత్, ఎండీ యాకూబ్ పాషా, ఒద్దులే సాకేత్‌రెడ్డి, మాతంగి దిలీప్, చల్లూరి రక్షిత, కొమ్మెర రమేశ్‌చారి, మట్టి కృష్ణ, గోలి లావణ్య, పుప్పాల వనిత, గోనాల తిరుపతి పాల్గొన్నారు.

అక్రమ ఇళ్ల నిర్మాణాల అడ్డగింత

కాటారం, జూలై 12 : మండలకేంద్రంలో ఎలాంటి అనుమతులు లేకుండా లావణి పట్టా భూముల్లో అక్రమంగా చేపట్టిన ఇళ్ల నిర్మాణాలను అధికారులు శుక్రవారం అడ్డుకున్నారు. తహసీల్దార్ నాగరాజు, ఎంపీడీవో బాబు, ఎంపీవో ఉపేంద్రయ్య ఆదేశాల మేరకు పంచాయతీ కార్యదర్శి షఫీర్‌ఖాన్ ఆధ్వర్యంలో పంచాయతీ సిబ్బంది, వీఆర్ఏలు ఇళ్ల నిర్మాణాలను అడ్డుకున్నారు. పనిముట్లు, సామగ్రిని జీపీ కార్యాలయానికి తరలించారు. అక్రమ ఇళ్ల నిర్మాణదారులకు నోటీసులు ఇచ్చారు. ఇళ్ల నిర్మాణాలు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

వృద్ధురాలి బంగారం అపహరణ

వెంకటాపూర్, జూలై 12 : సినీ ఫక్కీలో ఓ వృద్ధురాలి బంగారం దొంగిలించిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్సై సతీశ్ కథనం ప్రకారం.. గురువారం సాయంత్రం సుమారు ఆరు గంటల ప్రాంతంలో ఒక మహిళ, పురుషుడు మండలంలోని సింగరకుంటపల్లిలోని లింగాల లక్ష్మిఇంటికి వచ్చారు. మంచినీళ్లు అడిగి తాగి తలనొప్పి ఉందని టీ కావాలని లక్ష్మి ని అడుగగా ఇంట్లో పాలు లేవని చెప్పగా వారుపాల ప్యాకెట్ తీసుకొచ్చి టీ పెట్టించి తాగారు. అనంతరం మాటలు కలిపి లక్ష్మికి జ్వరమొచ్చిందని తెలుసుకొని తమకు ఇంత సాయం చేశావని చెప్తూ వారి వద్ద ఉన్న మత్తు మందును ఓఆర్ఎస్ అని తాగించారు. లక్ష్మి స్పహ కోల్పోగానే మెడలో ఉన్న తులంన్నర బంగారు గొలుసు, చెవి కమ్మలు తీసుకొని పరారయ్యారని తెలిపారు. శుక్రవారం లక్ష్మి కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నట్లు ఎస్సై చెప్పారు.

విచారణ చేస్తున్న ఎస్సై సతీశ్

ఉపాధ్యాయులకు సన్మానం

గణపురం, జూలై 12: మండలంలోని బుద్ధారం పాఠశాలలో పనిచేసి ఉద్యోగోన్నతులు పొందిన ఉపాధ్యాయులను శుక్రవారం గ్రామస్తులు, విద్యార్థులు, తోటి ఉపాధ్యాయులు సన్మానించారు. ఉపాధ్యాయులు రోజా, బైరి నరసింహస్వామి, వేణు, కరుణను పూల మాలలు శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం శ్రీలత, ఉపాధ్యాయులు సీహెచ్ రవి, నాగ భవాణి, విజయలక్ష్మి, దయాకర్, శ్రీదేవి, జ్యోతి, కే రవి, పావని పాల్గొన్నారు. అలాగే మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో పనిచేసి పదోన్నతి, బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను హెచ్ఎం దూలం కుమారస్వామి అధ్యక్షతన సన్మానించారు. ఉద్యోగోన్నతి పొందిన ఉపాధ్యాయులు కందుకూరి నర్సింహమూర్తి, రాచకొండ భాస్కర్, బదిలీపై వెళ్లిన మడిపోజు శ్రీదేవి, పరికి కోమల, పాఠశాలకు వచ్చిన కుమారస్వామి, దేవేంద్ర, జలేందర్, శ్రీధర్, స్వర్ణలతను సత్కరించారు. హైస్కూల్ హెచ్ఎం దేసు సతీశ్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ రజిత, ఉపాధ్యాయులు భరత్‌కుమార్, కుమారస్వామి, రమేశ్, చంద్రమౌళి, సీఆర్పీ సతీశ్, ఐఆర్‌పీ జ్యోతి పాల్గొన్నారు

ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య



మేనం నరేశ్(ఫైల్)

మల్హర్, జూలై 12 : మండలంలోని తాడిచర్ల గ్రామానికి చెందిన మేనం నరేశ్ (27) ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు కొయ్యూరు ఎస్సై నరేశ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. కొంతకాలంగా నరేశ్ అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఆపరేషన్ చేయించుకున్నా తక్కువ కాకపోవడంతో మనస్తాపం చెంది గురువారం రాత్రి ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై చెప్పారు. మృతుడి అన్న మేనం రాకేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

'కేజీవీబీ బోధన, బోధనేతర సిబ్బందిని రెన్యూవల్ చేయాలి'

మంగపేట, జూలై 12 : కేజీవీబీ బోధన, బోధనేతర సిబ్బందిని రెన్యూవల్ చేయాలని టీపీజీఎఫ్ జిల్లా కార్యదర్శి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి సమ్మయ్య, పల్లె నాగరాజు కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని కేజీవీబీలో పనిచేస్తున్న ఉద్యోగులను రెన్యూవల్ చేసి, కేవలం ములుగు జిల్లాలో మాత్రం చేయకపోవడం చాలా అన్యాయమన్నారు. జిల్లా